మనిషిలో మనసు

అత్తిలి వెంకటరత్నం

ఆకాశం నల్లగా ఉంది

సీతారత్నం కిటికీ ఊచలు రెండుచేతుల తోను పట్టుకుని నిలబడింది చూపులు బయటకి చూస్తున్నాయి మనసెక్కడో ఆలోచిస్తోంది ఉండి ఉండి అక్కడక్కడ ఆకాశంలో మెరపులు మెరుస్తున్నాయి సీతారత్నం మనసులో కోరికలలాగ.

'తనకి పెళ్లయిపోయి మూడు సంవత్సరా లయింది యీరోజుకి' ఆమె - మనసులో అనుకుంది 'పిల్లలు పుట్టలేదు తనకి' సీతారత్నం తనమీద తాను జాలిపడేలోగానే మనసు అడ్డుపడి సంతోషించమంది.

ఎందుకు? సీతారత్నం శరీరానికి నోరుంది మనసుకి లేదు చెప్పడానికి చల్లగా వానజల్లు కిటికీలోనుంచి ముఖంమీద పడింది సీతారత్నం పమిటచెరగుతో తుడుచు కుంది చేతిౖవేళ్ళ చీరలో ఉన్న చిరుగును పెద్దది చేసాయి.

వీధితలుపు దబదబా చప్పుడయింది

'ఆయన వచ్చారు' సీతారత్నం అనుకునే లోపుగానే తలుపు మళ్లా చప్పుడయింది. ఆమె గుండె లయగా దడదడలాడింది

'వినపడదా? గంటనుంచీ తలుపు కొడుతుంటేను' రమణ విసురుగా భార్యను తప్పుకుని లోపలికి వచ్చాడు.

సీతారత్నం మాట్లాడకుండా తలుపు మళ్లా గడియవేసింది.

'ఇవి తీసి అలమారులో పెట్టు.' రమణ చేతిలోని కాగితాలఫైలు మంచంమీద పడేసాడు

ఆమె మెల్లిగావంగి అవితీసి చేత్తో పట్టుకుంది

రమణ తడిసి శరీరానికి అతుక్కుని పోయిన చొక్కావిప్పి తలుపుమీద పడేసాడు.

'చాకలివచ్చి వెళ్ళాడా?'

సీతారత్నం తల అడ్డంగా ఊపింది.

'ఈ చొక్కా వరండాలో ఆరబెట్టు. ప్రొద్దున్నే అదే వేసుకోవాల మళ్లీ'

ఆమె అది తీసుకుని వరండాలోకి వచ్చింది.

వానజల్లుకి నేలంతా తడిసి జిగురుగా పాదాలకి అంటుకుంటోంది చూరమ్మట వాననీరు ధారలుగా క్రిందకి పడుతోంది.

'వేడినీళ్లున్నాయా?'

'లేవు.'

'పెట్టలేదా యివాళ.'

'పుల్లలయిపోయాయి.'

'సరే యేదో ఒకటి. నామొహానకొట్టు'

సీతారత్నం బకెట్తో నీళ్ళు తీసుకు వచ్చి వరండావారగా పెట్టింది. రమణ స్నానం చేసాడు

'తువ్వాలేదీ?'

సీతారత్నం తీసుకువచ్చియిచ్చింది.

'యింత తడిగా ఉందేం?

'వర్షం వచ్చింది'

'తెలుస్తూనేఉంది. యింట్లోకి తీసుకు రావటం తెలియదు కామోసు'

'మరచిపోయాను' అని ఆమె అనలేదు. అన్ని మాటలు ఉపయోగించడం సీతారత్నంకి అలవాటులేదు. ఎందుకు? అన్నా ఒకటే లేకపోయినా అంతే నిశ్శబ్దంగా అక్కడి నుంచి వంటగదిలోకి వెళ్లిపోయింది

'ఏమయినా ఉత్తరాలు వచ్చాయా?. రమణ భోజనానికి కూర్చుంటూ అడిగాడు'

'ఊహు' సీతారత్నం నోటమ్మట శబ్దం రాలేదు

'మీ నాన్నదగ్గరనుంచి'

'లేదు'

'ఈ సారి పండగకి పిలవడు కామోసు.

సీతారత్నం మాట్లాడటానికి ప్రయత్నించలేదు. శరీరభారాన్ని గోడకి ఆన్చి నిల

బడింది.

'ఈ కూరలో ఉప్పు తగలెయ్యలేదులా ఉంది చప్పగా యేడ్చింది'

సీతారత్నం ఒక క్షణం అలాగా అన్నట్లు కనురెప్పలు కదిల్చింది

నిముషాలు దొర్లిపోయాయి.

'చీరలు చిరిగిపోయాయి' ఈసారి సీతారత్నం తనంత తాను పెదవులు కదిల్చింది.

రమణ ఒకసారి తలయెత్తి చూసి మళ్లీ దించుకున్నాడు

'మీ నాన్న పండగకి పిలవకపోయినా బట్టలు పంపుతాడేమో! చూద్దాంలే తరువాత' రమణ లేచివెళ్లిపోయాడు

సీతారత్నం ఒకసారి దీర్ఘంగా విశ్వసించి శరీరభారాన్ని గోడమీదనుంచి తప్పించింది

రమణ భోజనం చేసిన కంచం కడిగేసి తనకి వడ్డించుకుని కూర్చుంది.

సీతారత్నంకి ఆకలిగాలేదు అయినా తినాలి యిప్పుడు భోజనం చేసేస్తే మళ్లా మర్నాడు మధ్యాహ్నంవరకూ చెయ్యనక్కరలేదు.

సీతారత్నం భోజనంచేసి వంటగదిఅంతా శుభ్రం చేసింది.

వర్షం వెలిసిపోయింది. బయట కీచురాళ్లు పండగచేసుకుంటున్నాయి కప్పలు పోట్లాడుకుంటున్నాయి

సీతారత్నం గదిలోకి ఒొకసారి చూసింది రమణ ఆఫీసు కాగితాలు ముందు పెట్టుకుని వ్రాసుకుంటున్నాడు

ఆమె మళ్లీ శరీరాన్ని గోడకి ఆన్చింది ఆ యింటిలో రెండుగదులున్నాయి.

ఒక వరండా ఉంది సీతారత్నంకి బాగా యిష్టమయిన స్థలాలు రెండు.

రమణ యింట్లో లేకపోతే ఆ గదిలో కిటికీ ప్రక్కన ఉంటే యింట్లో ఉన్నంతసేపూ వంటగది పొగ మారినగోడ. చీర మాసిపోతుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు

రమణ కాల్చే సిగరెట్టుపొగ సీతారత్నం ముక్కు పుటాలికి ఘాటుగా తగిలింది క్రొత్తలో ఆమె ముక్కుకి చీరమడతలు అడ్డుగా పెట్టుకునేది

సీతారత్నం ఆవలింతకి చేయి నోటికి అడ్డంగా పెట్టుకుంది కాళ్లు కొంచెం పీకుతున్నట్లు అనిపించింది

మరి కొంచెంసేపు తరువాత గదిలో లైటు ఆరిపోయింది

సీతారత్నం కనులువిప్పి భారంగా నిట్టూర్చింది. ఆమె కాళ్లు అలవాటుగా చీకటిలోకి దారితీసాయి

ఆమె చేతికి మంచంపట్టె అడ్డుగా తగిలింది

దూరంగా ఎక్కడో గడియారం పదకొండుగంటలు కొట్టింది

మంచంమీద ప్రక్క బట్టలు పత్తుగా లేకపోవటంచేత సీతారత్నం నడుముక్రింద తెగిపోయిననవారు ముడి గుచ్చుకుంటోంది,

ఆమె ప్రక్కకి జరిగింది రమణ మోచేయి చర్మం చల్లగా తగిలింది

సీతారత్నం మళ్లీ ముడిమీదకి జరిగింది

'చీకటి ఎంతో చల్లగా ఉంది' ఆమె అనుకుంది నిద్ర వచ్చినట్లేపోయింది కనులు విప్పిచూస్తూ పడుకుంది

'తనకి పెళ్లయిపోయి మూడేళ్లయిపోయింది' మనసు మళ్లీ గుర్తు చేసింది మూడేళ్ళలోనూ తన జీవితంలో జరిగిన పెద్ద మార్పులూ, గుర్తుంచుకోవలసిన విషయాలు ఏవీ మిగులలేదు ఒక్క తనికి వివాహం అయిపోయిందన్న మాట తప్పితే

పురోహితులు మంత్రాలు చదివారు ఆయన మెడలో తాళి కట్టారు తను ఎవరికో భార్య అయిపోయింది తనకి తెలిసిన విషయం అదే! అందరూ అన్నారు పెళ్లి అయిపోయిందని అక్షింతలు చల్లి ఆశీర్వదించారు లోకంలో ఎదిగిన ఆడపిల్ల లందరికీ పెళ్లి అవుతుంది తనకి కూడా అయింది

నాన్న చేతులమీద బరువు దించుకుని తృప్తిగా శ్వాస పీల్చారు

అంతే కాదు స్టేషనుకి దిగబెట్టడానికి వచ్చినప్పుడు కన్నీరు పెట్టుకున్నారు తనకి ఏడుపు రాలేదు అలాగే ఆయనవంక ఎదురుగా చూస్తూ ఉండిపోయింది

'అందంగా పెద్ద లేకపోయినా వికారంగా లేడు' అంది అమ్మ

'వియ్యే తప్పితే మాత్రం యేం? ఏదో ఉద్యోగం పర్వాలేదు భార్యని పోషించగలడు' అనుకుని ఉంటారు నాన్న.

తనేమని అనుకుంది? ఏమో! ఎవరడిగారసలు? తనకేం కావాలి?

ఏమో! కోరికలు మనసులో మంచులా పేరుకు పోయాయి. వాతావరణం హెచ్చుగా లేదు. మంచు కరగలేదు. మరింత గట్టిపడింది.

రమణ ఒకసారి దగ్గి లేచి కూర్చున్నాడు. సీతారత్నంలోని మనసు మళ్లీ నత్తగుల్లలోని నత్తలా ముడుచుకుపోయి ఎక్కడో దాక్కుంది ప్రక్కకి వత్తిగిల్లి కనులు గట్టిగా మూసుకుని పడుకుంది

'ఇదిగో మంచినీళ్లు ఎక్కడ పెట్టావ్?' రమణ సీతారత్నం భుజం పట్టి కుదిపాడు.

సీతారత్నం లేచి యిచ్చి మళ్లీపడుకుంది.

కిటికీలోనుంచి పడుతున్న ఎక్కడో దీపం వెల్తురు కూడా ఆరిపోయి చీకటి చక్కగా పేరుకుంది

సీతారత్నంకి శాంతంగా అందమయిన చీకటిలోకి చూస్తూ ఆలోచించే అవకాశం మిగులలేదు

'మళ్లీ తెల్లవారుతుంది' మనసు శరీరాన్ని విడిచిపెట్టి నిద్రపోడానికి ప్రయత్నించింది

* * *

'ఇదిగో!' రమణ అద్దంముందు తల దువ్వుకుంటూ పిలిచాడు

సీతారత్నం మంచం వానుకుని వెనకాల నిలబడింది చూస్తూ రమణ జుట్టు దువ్వెనకి లొంగకుండా తిరగబడుతోంది సీతారత్నం చూపులు బనియనులేని రమణ ఛాతీమీద నిలచిపోయాయి సన్నగా పీలగా ఉన్న శరీరం చుట్టూ బిగుతుగా చర్మం బిగించినట్టుగా ఉంది ప్రక్క టెముకలు బలంగా కన్పిస్తున్నాయి

సీతారత్నం బలవంతాన కనులు మరల్చింది.

'వెనకాలే ఉండి పిల్చినా పలకవేం?' రమణ ప్రక్కకి చూసి అన్నాడు

సీతారత్నం మాట్లాడకుండా లోపలికి వెళ్లి కారియరుతో తిరిగివచ్చింది

'కూరలున్నాయా?' అందుకుంటూ అడిగాడు

'లేవు'

'మరి చెప్పి చావకపోతే నా కెలా తెలుస్తుందనుకున్నావ్?'

సీతారత్నం బాధపడ్డట్లు యేమీ కన్పించలేదు మాట్లాడకుండా వంకెన ఉన్న సంచి తీసియిచ్చింది

రమణ వెళ్లిపోయాడు

'మళ్లీ రాత్రివరకూ రాడు' సీతారత్నం మనసు యేదో క్రొత్త రహస్యం చెప్పినట్లు అంది.

సీతారత్నం వీధితలుపు గడియపెట్టి ఒకసారి గదంతా కలయచూసింది గది నిండా చిందరవందరగా ఉన్న సామాను ఎంతో సన్నిహితంగా చూసాయి. 'నిన్నటికీ యీ రోజుకీ తేడా యేమీలేదు రేపటిరోజుకీ కూడా యేమీ ఉండదు' సీతారత్నం గది మధ్యగా గభాలున నేలమీదే కూర్చుంది ఎందుకో తనివితీరా గట్టిగా యేడ్వాలని అనిపించింది కాని ఆ బాధ పెదవివెనుక లోలోనే అణగారిపోయింది కంటికొండి ఒక బిందువు బుగ్గలమీదనుంచి జారి పెదవిని స్పృశించింది

'కన్నీటికి కూడా రుచి ఉంది ఉప్పగా ఉంటుంది,' ఆమె మనసు శరీరంమీద జాలిపడింది!

కాలం సీతారత్నం కోసం ఆగలేదు

'ఏమండీ' సీతారత్నం ఉలికిపడి ముఖాన కప్పుకున్న చేతులు తీసేసి చూసింది.

మళ్ళీ ఎవరో పిలిచారు

సీతారత్నం చీరతో ముఖం తుడుచుకుని వంటగదిలోనుంచి వరండాలోకి వచ్చి చూసింది.

'మీ యింట్లో ఏమయినా తాళం చెవులు ఉంటే యిస్తారా?'

సీతారత్నం వచ్చినావిడని ఎగాదిగా చూసింది.

'నా పేరు నిర్మల మేము ఈ ప్రక్క వాటాలోకి నిన్ననే వచ్చాం' ఆవిడ అంది

సీతారత్నం తెలుసన్నట్లుగా తల ఆడించింది

'యిల్లు మార్చే హడావుడిలో ఎక్కడో పారేసాను ముఖ్యమయినవన్నీ ఆ పెట్టెలోనే

మనిషిలో మనసు

ఉన్నాయి' నిర్మల చుట్టూ చూస్తూ అంది

సీతారత్నం లోనికి వెళ్ళి తీసుకువచ్చి యిచ్చింది.

నిర్మల అవి తీసుకుని హడావుడిగా వెళ్ళి పదినిముషాలలో తిరిగివచ్చింది.

'తాళం వచ్చేసిందాండి?' అని సీతారత్నం అడగలేదు. తాళాల గుత్తి తీసుకుంది

'మొదటిదానితోటే వచ్చేసిందండి మీ రీ యింట్లో ఎన్నాళ్ళబట్టి ఉంటున్నారు?' నిర్మల అడిగింది

సీతారత్నం జవాబు చెప్పలేదు 'లోపలికి రండి' అంది.

నిర్మల అంతా కలయజూస్తూ అడుగు లోపల పెట్టింది.

'కూర్చోండి' సీతారత్నం మూలనున్న జిడ్డుపట్టిన కుర్చీ ముందుకి లాగింది

గోడమీద రమణ ఫోటో చూస్తూ నిర్మల అడిగింది

'మీ . ' ఆమె పూర్తి చేయలేదు.

సీతారత్నం తల ఊపింది.

'మీ రిద్దరేనా?'

సీతారత్నం అవునన్నట్లుగా కళ్ళు కదల్చింది

'మాకు కూడా పిల్లల గొడవలేదులెండి' నిర్మల ఎంతో పరిచయమున్న దానిలా నవ్వింది.

సీతారత్నం నవ్వడానికి ప్రయత్నించింది.

'మావారు అసిస్టెంటు యింజినీరు. నిర్మల, సీతారత్నం తన గురించి కూడా చెప్తుందేమోనని ఎదురు చూసింది

సీతారత్నం మాట్లాడక పోయేసరికి నిర్మల మళ్ళీ అంది 'మీవారు ఏదో కంపెనీలో పనిచేస్తున్నారని యింటాయన చెప్పాడు'

'ఊ' సీతారత్నం పెదవులు కదిలాయి.

'ఎక్కడ?'

'నాకు తెలియదు'

నిర్మల ఆశ్చర్యంగా చూసింది.

'మీరు ఒక్కరేకదా? ఆయన వెళ్ళిపోయిన తరువాత ఒంటరిగా కాలం ఎలాగ గడుస్తుంది?' నిర్మల అడిగింది

'గడవదు. కాని గడుస్తోంది' సీతారత్నం మనసు వెగ్గరగా అరవబోయి నోరు మూసుకుంది.

నిర్మల మరికొంచెం సేపు కూర్చుంది ఏదో అవీ యివీ అడుగుతూ

'మరి వెళ్తానండి. మళ్ళీ ఆయన వచ్చేస్తారు భోజనానికి' నిర్మల వెళ్ళిపోడానికి లేచింది

'మీకనయిపోతే మా యింటికి రాకూడదూ చూడటానికి. మీకూ నాకూ కూడా కాలం గడుస్తుంది' గుమ్మం దగ్గర ఆగి వెనక్కి తిరిగి అంది

సీతారత్నం ఒక క్షణం సందేహించి బయలుదేరింది.

ఆ రాత్రి ఆమె చాలా ఆలస్యంగా నిద్రపోయింది.

'నిర్మల భర్త రాజారావు జుట్టు చాలా అందంగా ఉంటుంది వంకీలు తిరిగి కెరటాలులాగ.' సీతారత్నం మనసు రహస్యంగా చెవిలో గుసగుసలాడి నిద్రపోయింది చివరకి.

నిన్నటిరోజుకి యీరోజుకి తేడా ఉందని సీతారత్నంకి తెలియలేదు

*　　　*　　　*

'మీ వారు నిన్నరాత్రి చాలా ఆలస్యంగా యింటికి వచ్చినట్లున్నారు ఎప్పుడూ అంతేనా?' నిర్మల చాకుతో ఆపిల్ ముక్కలు కోస్తూ అడిగింది.

'ఊఁ ఆఫీసు' సీతారత్నం సోఫా అంచు మీద కూర్చుంది తన చీర మకిలి దానికి అంటుకుంటుందేమోనని భయపడ్డట్టు

ఆమె వ్రేళ్ళు సోఫా మదృత్వాన్ని పరీక్ష చేస్తున్నాయి.

మనిషిలో మనసు

'సరి బాగా ఎక్కువవన్నమాట' నిర్మల జాలిపడింది

సీతారత్నం మాట్లాడలేదు. చూట్టూ చూస్తూ కూర్చుంది. గోడలమీద వర్ణచిత్రాలు న్నాయి అందంగా గది మధ్యలో నేలమీద తివాచీ పరచారు. నలుచదరంగా సోఫాలు. వాటి మధ్య అందమయిన టీపాయ్.

'నిర్మల వాళ్ళు పడుకునే మంచం మీద నవారు ముడులు గుచ్చుకోవులాగుంది.' సీతారత్నం అనుకుంది

'మా నాన్నగారు డిస్ట్రిక్ట్ మాజిస్ట్రేటు. అప్పుడు వరంగల్‌లో కొన్నాళ్ళు ఉన్నాం తరువాత ఏలూరు వచ్చిన తరువాత కారు కొన్నారు. మా వారిని కారు కొనమంటే పొడు! స్కూటర్ కొన్నారు' సీతారత్నం మాట్లాడటం లేదని నిర్మలకి తెంగలేదు. చింటేచాలు

'దీనికి అద్దె ఎంత?' సీతారత్నం అడిగింది

'నూటయిరవై' నిర్మల కళ్ళు మెరిసాయి

'అమ్మో!' సీతారత్నం గుండెల మీద చేయివేసుకుంది 'మా యింటికి నలభై'

'మరి మీకు యిల్లు సరిపోతుందా?'

'ఎక్కువయిపోతోంది!' సీతారత్నం తన లోనే అనుకుంది

'ఉండండి మాఫోటో ఆల్బమ్ చూపిస్తాను' నిర్మల ప్రక్కన ఉన్న డ్రాయరు లాగి పెద్ద ఆల్బమ్ సీతారత్నం చేతిలో పెట్టింది

'మీరెప్పుడయినా బొంబాయ్ వెళ్ళారా?'

'ఊహుఁ' సీతారత్నం తల అడ్డంగా ఊపింది.

'అక్కడ లోచకపోవడం అసలుండదను కోండి మేము వెళ్ళినప్పుడు వానలు! అయినా టాక్సీలో తిరిగి అన్నీ చూసాం. అక్కడ మా మావయ్య వాళ్ళు ఒక యిల్లు కొనుక్కున్నారు ఎనభయివేలుట. కాని మా ఊర్లో యిల్లంత కూడా ఉండదు. పైగా పాత మోడలు!'

సీతారత్నం అన్యమనస్కంగా ఆల్బమ్ పేజీలు తిరగవేస్తోంది మొదటి పేజీలో నిర్మల, భర్త తీయించుకున్న పెళ్ళి ఫోటో కాపీలు ఉంది ఆన్నీ తరువాత నిర్మలవే నిల్చున్నప్పుడు, జడ వేసుకుంటున్నప్పుడు వంట చేస్తున్నప్పుడు, స్నానం చేసిన తరువాత తడిబట్టతో సీతారత్నం ఆశ్చర్యపోయింది

'మావారు తీసిన ఫోటోలే యివన్నీ, యింకా మేము హనీమూన్ వెళ్ళినప్పటివి ముందున్నాయి చూడండి' నిర్మల గబగబా పేజీలు త్రిప్పింది

'ఇది అమరావతిలో తీయించుకున్నాం యిదేమో కలకత్తా దగ్గర ఏదో 'లేక్ వ్యూ' పేరు అప్పుడే మరచిపోయాను ఊటీ నుంచి వచ్చేటప్పుడు మద్రాసులో ఆగాము. యిది పారిస్ కార్నర్.' నిర్మల ఒక్కొక్కటే చెప్పుకుపోతోంది.

'యిన్ని ఊళ్ళు ఎక్కడున్నాయి?' సీతారత్నం మనసు ఆశ్చర్యపడింది

'మీరు చూసారా? మేము అప్పుడు బొంబాయి వెళ్ళినప్పుడు 'అప్సరా'లో చూసాం ఆ పిక్చరు యిప్పుడు యీ ఊరు వచ్చింది.' నాకు మళ్ళీ చూడాలని ఉంది ఆయన్ని రమ్మంటే రానన్నారు మీరు నాతో రాకూడదు పిక్చరు చాలా బాగుంటుంది'

సీతారత్నంకి ఆ సినిమా పేరునుబట్టి హిందీయో, యింగ్లీషో కూడా తెలియలేదు.

'మీరు వస్తానంటే యివాళే ఫ్యాన్ చేత టిక్కట్లు బుక్ చేయిస్తాను'

'రేపు చెప్తాను' సీతారత్నం నోరు మెదల్చుకుని అంది.

'ఓ, ఆయన్ని అడగాలా?' నిర్మల నవ్వింది

సీతారత్నం ఆల్బమ్ అట్ట అంచు వేళ్ళతో పాముతూ ఉండిపోయింది చాలా సేపు గడిచిపోయింది నిర్మల ఏదో మాట్లాడుతూనే ఉంది సీతారత్నం చెవులు వింటూనే ఉన్నాయి మనసు ఎక్కడో ఏదో ఊహిస్తూ ఆలోచిస్తోంది.

వీధిలో స్కూటర్ ఆగిన శబ్దం వినిపించింది

'ఆయన వచ్చినట్లున్నారు' నిర్మల గభాలున లేచింది

సీతారత్నం లేచి నిలబడింది. నిర్మల వంటగది గుమ్మంవరకూ కూడా వచ్చి మళ్ళీ వెళ్ళిపోయింది

సీతారత్నం ఒకక్షణం అక్కడే నిలబడింది ఎందుకో ఆమె మనసు ఒకక్షణం తటపటాయించింది—

మరుక్షణం దగ్గరగాఉన్న తలుపు రెక్కల సందులోనుంచి చూసింది నిర్మల తన రెండుచేతులూ రాజారావు కంఠం చుట్టూ పెనవేసి నిలబడి ఏదో అంటోంది.

సీతారత్నం హృదయం వింతగా కొట్టుకుంది. అడుగులు త్వరగావేస్తూ తమ వాటాలోకి వచ్చేసింది

'నిర్మల, రాజారావు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారట' సీతారత్నం కిటికీలోనుంచి చూస్తూ అనుకుంది

మరో అరగంట తరువాత రాజారావు, నిర్మల నవ్వుకుంటూ బయటికి వచ్చారు. రాజారావు యింటికి బయట తాళం వేస్తున్నాడు నిర్మల చుట్టూ చూసింది

సీతారత్నం శరీరం ప్రక్కకి జరిగింది. రాజారావు వెనకాల నిర్మల స్కూటర్ ఎక్కి కూర్చుని అతడి నడుముచుట్టూ

తెలియచుట్టేంది.

'అలా పట్టుకోకపోతే పడిపోతారేమో!' సీతారత్నం అనుకుంది

రాత్రి భోజనంచేస్తూ ఉండగా రమణ పిలిచాడు. ఆమె పలికిందో లేదో ఆమెకే తెలియదు.

రమణ వంటగది గుమ్మందాకావచ్చి ఏదో పొట్లాం ప్రక్కన పడేసాడు సీతారత్నం తల ప్రక్కకి త్రిప్పిచూసింది

పొట్లాం సందులలోనుంచి చేమంతి పూలరేకులు తొంగిచూస్తున్నాయి

సీతారత్నం భోజనం పూర్తిచేసేసి పువ్వుల పొట్లాం తలుపుతీసి మొక్కల మధ్యకి చీకటిలో విసిరేసి ఏడ్చింది

రమణ పువ్వులు పెట్టుకోలేదేమని భార్యని అడగలేదు అతనికి తెలియదు ఆమె పెట్టుకోలేదని అతను అవన్నీ చూడడు అవసరంలేదు ప్రక్కనున్న వాళ్లెవరో కొంటూ ఉంటే తనూ కొన్నాడు.

రమణకి రక్తంలో వెచ్చదనం ఉంది మనసుకి లేదు.

'నిర్మల చాలా కలుపుగోలు మనిషి డబ్బున్న గర్వంలేదు రాజారావుకి ముఖం మీద స్ఫోటకం మచ్చలులేవు' సీతారత్నం నిరంతరం సిగరెట్ల వేడికి కమిలి మృదుత్వం కోల్పోయిన పెదవుల స్పర్శను తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ అనుకుంది.

* * *

అర్ధరాత్రి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది సీతారత్నంకి

కిటికీలో నుంచి వెన్నెల పాలవెల్లువలా నేలమీద పడుతోంది సీతారత్నం మెల్లిగా మంచం మీదనుంచి లేచి వరండాలోకి తలుపు తీసి నిలబడింది.

రమణ నోటి నుంచి చిన్న గురక వస్తోంది.

సీతారత్నంకి ఆ క్షణంలో ఎక్కడికయినా పారిపోతే బాగుండుననిపించింది ఆమె కాళ్లు మెల్లిగా దొడ్లో మొక్కల మధ్యకి దారితీసాయి

వెన్నెల జల్లులా ప్రతి ఒక మొక్కను, ఆకును పలకరించి పులకింపచేస్తోంది 'తనకి పెళ్లికాక ముందు వెన్నెల రాత్రి అసలు నిద్రపోకూడదు అనుకునేది' సీతారత్నంకి జ్ఞాపకం వచ్చింది అప్పుడు బ్రతుకంతా పండు వెన్నెలగా ఊహించుకుని ఆనందించింది.

ఇప్పుడు వెన్నెల తనని భయపెడుతోంది ఒంటరితనంతో వెన్నెల కాస్తూనే ఉంది నెలకొకసారి పున్నమి పలుకరించిపోతూనే ఉంది. తన మనసు ఉప్పు రుచి చూసిన పాలలాగ విరిగిపోతోంది చివరకి ఏం జరుగుతుంది? కొన్ని యేళ్ల తరువాత తన శరీరం చచ్చిపోతోంది. ఆయన స్వయంగా కొరివి పెడ్తారు. తన కోసం యేడుస్తాడా? తనకి తెలియదు ఎప్పుడు వస్తుంది ఆ స్వేచ్ఛ?

బహుశ మృత్యువు కౌగిలి యింకా వెచ్చగా ఉంటుందేమో! యముడు కూడా బొమ్మలలో అందంగానే ఉంటాడు సీతారత్నం అర్థంలేకుండా పిచ్చిగా ఆలోచిస్తోంది 'నాన్న, అమ్మ వచ్చి చచ్చిపోయిన శరీరం మీదపడి యేడుస్తారు తనకి అప్పుడెంతో ఆనందంగా ఉంటుంది ఎందుకో రమణ కూడా తనకోసం యేడిస్తే చూడాలని ఉంది' సీతారత్నం చేత్తో ఒక చిన్న మొక్క ఆకు త్రెంపి ప్రక్కకి పారేసింది

'చీకటిలో యేం చేస్తున్నావ్? ఎవరయినా చూస్తే భయపడతారు.' రమణ గుమ్మంలో నుంచి పిలిచాడు.

'నిర్మలా వాళ్ళువచ్చి నెలదాటింది' సీతారత్నం అనుకుంటూ లోపలికివచ్చి పడుకుంది

* * *

ప్రొద్దున్న పది గంటలయింది రమణ ఆఫీసుకి వెళ్లిపోయి గంటయింది. సీతారత్నం కుళాయి దగ్గర బట్టలుతుకుతోంది

'నాన్న పండుగకి పిలిస్తే బాగుండును. కొన్ని రోజులుండి రావచ్చు.' అనుకుంది.

సీతారత్నం ముక్కుకి పాలు పొంగిన వాసన వేసింది 'నిర్మలా వాళ్లింట్లో కాబోలు' అనుకుంది పది నిముషాల తరువాత ఆమె పని పూర్తయింది. యింకా వాసన వేస్తూనే ఉంది

సీతారత్నం చేతులు కడుక్కొని లేచి వెళ్లింది 'మీ యింట్లో పాలు పొంగిపోయినట్టున్నాయ్ నిర్మలగారూ' వంటగదిలో ఎవరూ లేరు స్టౌ మీద పాలు గిన్నెలోనుంచి పొంగి పొర్లి పోతున్నాయి అంచుల మీదనుంచి ప్రక్కకి

సీతారత్నం గభాలున పాలు దింపేసింది.

'ఎవరూ?'

సీతారత్నం వెనక్కి తిరిగి చూసింది రాజారావు గుమ్మంలో నిలబడ్డాడు నడుము చుట్టూ టర్కీ టవలు అప్పుడే స్నానం చేసిన గుర్తుగా ఛాతీ మీద నీటి బిందువులు మెరుస్తున్నయి

'పాలు పొంగి పోతేనూ..' సీతారత్నం కంగారుపడింది

'నిర్మల ఊళ్లో లేదు ప్రొద్దున్నే వాళ్ల నాన్నగారికి వంట్లో బాగాలేదని తెలిసి బెజవాడ వెళ్లింది' రాజారావు చెప్పడం పూర్తి కాలేదు

సీతారత్నం యింక విన్పించుకోలేదు. వెంటనే గబ గబా బయటకి వచ్చేసింది

'పాపం తనే వంట చేసుకోవాలి కాబోలు.'



తారత్నం జారి పడింది.

మరునాడు కుళాయి దగ్గర బిందెలోకి నీరు పడుతూ అనాలోచితంగా చుట్టూ చూసింది

రాజారావు వంట గది కిటికీలోనుంచి చూస్తున్నాడు తీక్షణంగా సీతారత్నం బిందె నడుముకి యెత్తుకుని నడిచింది. కొంతమేర జాకెట్టు, నడుము క్రింద భాగం తడిసి చల్లగా అనిపించింది. అడుగులు తమ యింటి వైపు వడి వడిగా వేస్తూనే ఒకసారి వారగా చూసింది రాజారావింకా అక్కడే నిల్చుని చూస్తున్నాడు

ఆ రోజునుంచి వరుసగా నాలు గయిదు రోజులు సీతారత్నం అదే టైముకి నీళ్ళు పట్టుకోడానికి వెళ్ళింది రాజారావు ప్రతీ రోజూ చుట్టుప్రక్కల కనపడుతూనే ఉండే వాడు

ఒకరోజు సీతారత్నం అతనివైపు చూసి నప్పుడు నవ్వాడు

'జాకెట్టు భుజం కింద చిరిగిపోయింది కుట్టుకోవాలి' సీతారత్నం అనుకుంది ఆ మరువాడు సీతారత్నంకి రాజారావు కనపడ లేదు

'రాజారావు నవ్వితే ఆడవాళ్ళలాగ బుగ్గ మీద సొట్ట పడుతుంది' సీతారత్నం అనుకుంది.

రెండురోజుల తరువాత రాజారావు మళ్ళా ఆమెకేసి చూసి నవ్వినప్పుడు సీతారత్నం కూడా చిన్నగా నవ్వి తలదించుకుంది

రాజారావు వంట గదిలోనుంచి బయటకు వచ్చాడు

'నీళ్ళన్నీ మీరే మోయాలా ? పనివాడు లేడా ?'

'లేడు.'

'రేపటినుంచి మా ప్యూన్‌తో చెప్తాను. వాడు తేసి పెడతాడులెండి.'

సీతారత్నం మాట్లాడకుండా నిల్చుంది. నీరు బిందె నిండిపోయి పొర్లిపోతోంది

'ఆవిడ ఎప్పుడు వస్తారు?' రెండు క్షణాలతరువాత అడిగింది.

'ఎవరు నిమ్మియేనా ? పుట్టింటికి వెళ్ళిందిగా. యింకా నేను గుర్తుండను. తనయిష్టం.' రాజారావు నవ్వాడు.

సీతారత్నం బిందెయెత్తుకుని వెళ్ళి పోయింది.

'జాకెట్టు చిరుగు పెద్దదయిపోతోంది వెంటనే కుట్టుకోవాలి' సీతారత్నం నిశ్చయం చేసుకుంది. కాని యిల్లంతా వెతికినా సూది, దారం కనపడలేదు

సీతారత్నం ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి వెదకడం మానేసింది

మరునాడు రాజారావుని సీతారత్నం చూసినప్పుడు రెండువ్రేళ్ళకి కట్లు కట్టాడు.

'నిన్న గిన్నె కాలింది' ఆమె అడగకుండానే చెప్పాడు.

సీతారత్నం ఆకాశంకేసి చూసింది ఎండపోయి మబ్బులు సూర్యుణ్ణి ఆక్రమించాయి 'వర్షం వస్తుంది' ఆమె పెదవులు కదిలాయి

'రమణగారు ప్రొద్దున్న వెళ్ళి మళ్ళీ రాత్రివరకూ రారా?' రాజారావు అడిగాడు.

సీతారత్నం అతని ముఖంలోకి ఒకక్షణం చూసింది.

'నిమ్మికూడా లేదు మీ ఒక్కరే వను కుంటూ పాపం' రాజారావు జాలిపడ్డాడు.

'మీరు వంటచేసేసుకున్నారా?' సీతారత్నం పెదవులు కదిల్చింది వర్షం పెద్ద చినుకులు పడటం ప్రారంభించాయి

'అన్నీ అయిపోయాయి అన్నం ఉడికింది కాని స్టౌ మీదనుంచి దింపడానికి భయంగా ఉంది' తన కాలినవ్రేళ్ళు చూపించి రాజారావు నవ్వాడు.

'నేను దింపుతాను' సీతారత్నం అతని వెనకాల వంటగదిలోకి వెళ్ళింది

వర్షం కొంచెం ఎక్కువయింది

'పెద్ద వర్షం అకస్మాత్తుగా వచ్చేస్తే బాగుండును' సీతారత్నం పట్టకారుతో గిన్నె క్రిందకు దింపి అనుకుంది

నిజంగానే వర్షం పెరిగి పెద్దదయి పోతోంది.

'వర్షం బాగా కురుస్తోంది' రాజారావు అన్నాడు.

సీతారత్నం మాట్లాడలేదు. గదంతా అకస్మాత్తుగా వేడెక్కిపోయినట్లనిపించింది

'వర్షం తగ్గాక వెళవచ్చు అంతవరకూ ముందు గదిలో కూర్చుందాం రండి యిక్కడంతా పొగ వాసన' రాజారావు అన్నాడు.

సీతారత్నం కాళ్ళు కదల్చలేదు. ఏదో నిర్లిప్తంగా వర్షపు ధారలకేసి చూస్తూ ఉండిపోయింది.

'అటుకు నిటుకులు నిశ్శబ్దం మెల్లగా ప్రాకింది. సీతారత్నంకి రాజారావు అంత సేపూ తన వైపే చూస్తున్నాడని తెలుసు.

'మీరు చాలా అందంగా ఉంటారు.' రాజారావు దగ్గరగా వచ్చాడు

సీతారత్నం శరీరం ఝల్లుమంది రక్తం చలికి గడ్డ కడుతుందేమో ననిపించింది

ఆమె కనులెత్తి అతనికేసి తీక్షణంగా చూసింది

అతను నవ్వాడు ఆమె అలాగే చూస్తూ ఉండిపోయింది ఆమె చూపులో భావం నిశ్చయంగా లేదు

'సీతారత్నంకి కోపం రాలేదు' రాజారావు అనుకున్నాడు

సీతారత్నంకి ఆ సమయంలో తన మంచం మీది నవారు ముడి గుర్తుకి వచ్చింది

రాజారావు మరింత దగ్గరగా వచ్చాడు. ఖరీదయిన సెంటు వాసన ఆమె ముక్కు పుటాలు నిండింది

మరుక్షణం సీతారత్నం ధారగా కురుస్తున్న వర్షంలోకి పరుగెత్తింది ఒక్క పరుగులో గదిలోకి వచ్చేసి తలుపు లోపల గడియ పెట్టేసింది

చీర, జాకెట్టు పూర్తిగా తడిసి పోయాయి నీరు అంచులమ్మట కారుతోంది. అలాగే మంచం మీద బోర్లగిలా పడుకుంది. మనసు ఏదో మత్తుగా తేలిపోతోం దనిపించింది

'తను అందంగా ఉంటుందిట' సీతారత్నంకి రాజారావు మాటలు చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి. యింతవరకూ పుట్టిన తరువాత ఎవరూ తనతో ఆ మాట అన లేదు రమణకి తను అందంగా ఉన్నా లేక పోయినా ఒకటే తను ఒక స్త్రీ అని తెలుసు పైగా తన భార్య అని కూడా తెలుసు

సీతారత్నం జుట్టు మీదనుంచి నుదుటి మీదకి జారిన నీటిని తుడిచింది

ఎండిపోయిన ఎడారిలాంటి ఆమె మనసు మీద ఒకే ఒక నీటి బొట్టు పడినట్టుగా ఉంది 'తనని ఎవరో ఒకరు మనిషిగా గుర్తించారు. అంతే చాలు.' సీతారత్నం శరీరం తృప్తితో బరువెక్కింది.

'పాలు పూర్తిగా విరిగిపతతుూతతూతా నీటిని వేరుచేస్తే క్రొత్తరుచిగా ఉంటుంది.' సీతారత్నం తనలో తనే నవ్వుకుంది. ఆమె

మనసుతో ఆలోచన ఒకపద్ధతి, కట్టుబాటు అనే పరధిలో చిక్కుకోడానికి యిష్టపడలేదు

'రాజారావు నిర్మలను 'నిమ్మీ' అని పిలుస్తాడు పెళ్ళిచేసికొని ఉంటే 'సీతా' అని పిలుస్తాడేమో!' సీతారత్నం పిచ్చిగా ప్రక్కమీద దొర్లింది.

మనిషి కోరికకి బానిస మనసును తృప్తిపరచడం కష్టం. శరీరాన్ని సుఖింప చేయడం సులభం. ఒక్కొక్కసారి శారీరక తృప్తినే మానసిక తృప్తిగా భావిస్తాడు మనిషి కోరికకు నీతి, నిజాయితీ అనే నియమం లేదు పదిమంది అవినీతి అనేదాని మీద కోరిక గలిగితే తన మనసుకికూడా తెలియకుండా చాటుగాచేస్తాడు అంతే తేడా

తెల్లవారింది సీతారత్నం రోజూకంటె ముందులేచిపోయింది ప్రక్కమీదనుంచి రమణ మామూలుగా ప్రొద్దున్నే వెళ్ళిపోయాడు. సీతారత్నం తలారా స్నానంచేసి వదులుగా జడ అల్లుకుంది క్షణాలు తీగలు సాగి యుగాలయి పోతున్నాయనిపించింది దొడ్లోనే అవీయివి వెతికి చివరికి ఏవో గడ్డిపూలన్నీకోసి మాలకట్టింది హృదయం అపస్వరాలన్నీ ప్రోగుచేసి సంగీతం అని మనసుని భ్రమపెట్టి ఆనందింప చేస్తోంది

'ఛీ! పాడు అద్దం సరిగా కనపడటం లేదు' సీతారత్నం తడిగుడ్డతో పాత అద్దాన్ని జిడ్డుపోయేదాకా తుడిచింది

ఈసారి కొంచెం ముఖం స్పష్టంగా కిందనిపించింది

'నిర్మలకన్న తనే అందంగా ఉంటుంది నిర్మలకి ముందుపళ్ళు ఎత్తుగా ఉంటయి!

'నిన్న తను అలా ఒకస్సారి పరుగెట్టుకుని వచ్చేస్తే రాజారావు ఏమనుకున్నాడో!'

సీతారత్నం ఆలోచనలు తేనెటీగల్లా విశ్చలతలేకుండా ఎగిరిపోతున్నాయి.

'అమ్మా!'

సీతారత్నం తిరిగి చూసింది

'అయ్యగారి కాగితం మీకియ్యమన్నారండి' రాజారావు నౌకరు ఆమె చేతికిచ్చాడు

సీతారత్నం కాగితం మడతలు విప్పింది

'నిన్న మీతో అసభ్యంగా ప్రవర్తించినందుకు విచారిస్తున్నాను మీరు కొన్ని క్షణాలు ఆగి ఉంటే నేను పతనమయి ఉండేవాడిని, మీకు మచ్చ మిగిలిపోయేది మనస్ఫూర్తిగా క్షమించమని ప్రార్థిస్తున్నాను.'

అంతకంటె మరేమీలేదు ఆ కాగితంలో.

సీతారత్నం ప్రతిమలా నిలబడింది కనులు పదేపదే నిర్జీవంగా ఆ కాగితంలోని అక్షరాలను ఉచ్ఛరించాయి.

ఒక్కసారి మందువేసవిలాంటి వాతావరణం ధృవప్రాంతంలోని శీతలంని మించిపోయినట్టుగా మారిపోయింది.

'యిలాగ ఎందుకు జరిగింది?' సీతారత్నం మనసు పదేపదే ప్రశ్నిస్తోంది

'అమ్మగారు వస్తున్నామని టెలిగ్రాం యిచ్చారు అయ్యగారు స్టేషనుకి వెళ్ళారు' నౌకరు చెప్పి వెళ్ళిపోయాడు

సీతారత్నం శరీరం స్వాధీనం తప్పి ఆ మాటలు వినలేదు. విన్నా అర్థం చేసుకునే స్థితిలో లేదు.

లేకపోతే రాజారావు అలాగ ఎందుకు చేసాడో అర్థమయి ఉండేది ఆ రాత్రి సీతారత్నం బక్కచిక్కిపోయిన రమణ దేహాన్ని దృఢంగా కౌగలించుకుని యేడ్చేసింది

రమణకేమి అర్థం కాలేదు 'ఛ! ఛ! యేమిటి? ఎందుకేడ్పు? వంట్లో బాగో లేదా?' మెల్లిగానే అడిగాడు

సీతారత్నం మరింత సన్నిహితంగా అల్లుకుపోయింది రమణకి అంతా ఆయోమయంగా అనిపించింది భార్య శరీరం ఎప్పటికన్న ఎక్కువ వేడిగా ఉన్నట్లనిపించి ఆనాలోచితంగా తను కూడా తగ్గరగా హత్తుకున్నాడు.

సీతారత్నం యేడుపు యింకిపోయింది.

'గుండెల మధ్య మంగళసూత్రం అడ్డం గుచ్చుకుంటూ బాధ అనిపించింది' సీతారత్నం సర్దుకోడానికి ప్రయత్నించలేదు.

మరునాడు సీతారత్నం ఆత్మహత్య చేసుకుంది.

* * *

'ఎలాగ ఉంది?' కాశీపతి ముఖంలో భావాలు మారిపోతూండగా అడిగాను నేను

'సీతారత్నం ఏ కారణంగా చనిపోయింది? అసంతృప్తా లేకపోతే పశ్చాత్తాపమా? నీ మనసులో విషయం పూర్తిగా వ్యక్తం చేయలేక పోయావనిపిస్తోంది చదివేవాళ్ళ సానుభూతి సీతారత్నంకి పోతుందేమోనని నీవు అనుక్షణం భయపడ్డావు అవునా?' కాశీపతి నా మనసును దూసుకు పోయేలా ప్రశ్నించాడు

నేను వెంటనే మాట్లాడలేక పోయాను

'పోనీలే కాని సీతారత్నం చనిపోవడానికి కారణం నీకేమని తోచింది?' నేను అడిగాను

కాశీపతి మళ్ళా ఒకసారి కాగితాలు వెనక్కి తిరిగేసి చూసాడు

'నాకు మాత్రం ' కాశీపతి పూర్తి చేయలేదు 'నువ్వు వట్టి పిరికివాడివి.' మధ్యలో ఆగిపోయి అన్నాడు

నా మనసు త్వరగా అంగీకరించలేపోయింది ●